ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



## బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎంఎ కలీమ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకపోగా, అబద్ధపు మాటలు, ప్రచారాలతో ప్రజలతో మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15వేల నష్టపరిహారం చెల్లించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ భీమా పథకాన్ని వేంటనే రైతులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సినీయర్ నాయకులు పరుశురాం జాదవ్, రాజేందర్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు గట్టు నారాయణ, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, దృవ రాజు, అడెపు రమేష్, సీనియర్ నాయకులు కోట్నక్ కోటేష్, శ్రీధర్ రెడ్డి, రజింత్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 139 దరఖాస్తులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణిలో వివిధ సమస్యలతో అర్జీదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 139 అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆ అర్జీలను సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో స్టాండ్‌ను కదపకండి



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** మండలంలోని బట్వాన్‌పల్లి, పెరకపల్లి ఆటో స్టాండ్ ఆటో యూనియన్ నాయకులు సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను కలిశారు. ఆటో స్టాండ్‌ల సమస్యల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 26 సంవత్సరాల నుంచి బెల్లంపల్లి పట్టణంలో కూరగాయల మార్కెట్ పక్కన ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకొని రవాణా సౌకర్యాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు మున్సిపాలిటీ వారు ఆ ఆటో స్టాండ్ నుంచి లోపల చదును చేసే భూమి కోసం దారి కావాలని ఆటో డ్రైవర్ల పై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోస్టాండ్ స్థలాన్ని ఎట్టి పరిస్థితిలో తీసుకునే ప్రసక్తే లేదని, వారి జోలికి మున్సిపాలిటీ వారు రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, ఆటోడ్రైవర్లు దిలీప్, పెరుగపల్లి గుండ్ల, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో యూరియా నిల్.. మద్యం ఫుల్



**ఉద్యమ కెరటం, జైనూర్ సిర్పూర్ (యూ):** అసమర్థ కాంగ్రెస్ పాలనలో రైతులకు యూరియా లభించకపోగా, మద్యం ఫుల్‌గా దొరుకుతుందని బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ (యూ) మండల అధ్యక్షులు తొడసం ధర్మారావు, లింగాపూర్ మండల సోషల్ మీడియా కన్వీనర్ జాటోత్ రాహుల్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కొరత విలయతాండవం చేస్తుందన్నారు. బస్తా ఎరువు కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. ఎక్కడ చూసినా రైతులు బారులు తీరుతున్నారని, యూరియా కొరతతో పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. రాష్ట్రంలో యూరియా సంక్షోభం నెలకొంటే ఇప్పటివరకు సీఎం ఒక్కసారి కూడా ప్రత్యేకంగా సమస్యపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, లింగాపూర్ మండల మాజీ జెడ్పీటీసీ ఆడే లక్య నాయక్, ఉపాధ్యక్షులు అర్కా నాగోరావ్, మాజీ సర్పంచులు ఆత్రం ఓంప్రకాష్, కోవ నాందేవ్, తొడసం తిర్మన్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నుణావత్ కిషన్, మెస్రం నరేష్, మాడవి మాన్కు, గజానంద్, మైనారిటీ సెల్ అధ్యక్షులు కరీం, గేడం పశ్యవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి 30 వేలు నష్టపరిహారం చెల్లించాలి





### సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**ఉద్యమ కెరటం, దహెగాం:** భారీ వర్షాలతో రైతులు నష్టపోయారని, ఎకరానికి రూ.30వేల చెల్లించాలని సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కర్జి శివారులో ఎర్రవాగు ముంచెత్తడంతో నష్టపోయిన పంట చేలను బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో ప్రాణహిత, ఎర్రవాగు, పెద్దవాగు వరుదల కారణంగా దాదాపు 12వేల ఎకరాల పంట నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికే రైతులు దాదాపు ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల పరిహారం ఏ మూలకు సరిపోదని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని లేవనెత్తుతామన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తే రైతులు ఎవరి దయా దాక్షిణ్యాలపై బతకాల్సిన పరిస్థితి ఉండదని తెలిపారు. గతంలో కేసీఆర్ రద్దు చేసిన ఫసల్ బీమా యోజనను పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏఈఓ సుస్మిత, బీజేపీ మండల అధ్యక్షులు దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ ఎల్కరి దామోదర్, సోమశేఖర్, మల్లాగౌడ్, రాజన్న, వెంకన్న, బక్కన్న, శ్రీను, లక్ష్మణ్, సత్యం, రవీందర్, గోపాల్, బొజ్జు తదితరులు ఉన్నారు.

## దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఉద్యమ కెరటం, దహెగాం:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కర్జీ – రాంపూర్ మధ్య రోడ్డు దెబ్బతింది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు వరదలతో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మత్తు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ ఎల్కరి దామోదర్, సోమశేఖర్, మల్లాగౌడ్, రాజన్న, వెంకన్న, బక్కన్న, శ్రీను, లక్ష్మణ్, సత్యం, రవీందర్, గోపాల్, బొజ్జు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ తాండూర్ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి తాండూర్ తహశీల్దార్ యూ జ్యోత్స్నతో పాటు ఎంపీడీఓ పి శ్రీనివాస్ లకు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేవారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకి పక్కా భవనాన్ని నిర్మించాలని, నర్సాపూర్ గ్రామపంచాయతీకి వెళ్లే దారిలో భీమన్నవాగుపై హై లేవల్ బ్రిడ్జి నిర్మించాలని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పాస్ బుక్ లు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశెట్టి విజయ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శులు పుట్ట కుమార్, మామిడి విగ్నేష్, సీనియర్ నాయకులు సిద్ధం మల్లేష్, చొక్కాల నాగభూషణ్, మాజీ వార్డు సభ్యులు దుర్గ చరణ్, మండల ఉపాధ్యక్షులు రేవెల్లి శ్రీనివాస్, కొండు రవి, మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల కోశాధికారి రాచర్ల సురేష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వల సతీష్, అరికల శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలు అందరికీ అందేలా చూడాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలందరికి అందేలా చూడాలని మండల పంచాయతీ అధికారి గౌరీ శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో పీఎం జూగా గ్రామ పంచాయతీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అంబగట్ట, ఊట్ సారంగపల్లి, సోమిని, మూగవెల్లి గ్రామపంచాయతీలు పీఎం జుగా గ్రామపంచాయతీలుగా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నవివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గిరిజన కుటుంబాలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమగ్రంగా అందించడం ద్వారా గిరిజన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడం పీఎం జూగా ప్రాథమిక లక్ష్యమని అన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన గ్రామపంచాయతీలో గృహ, సమాజ మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, ఆరోగ్యం, విద్య, విద్యుదీకరణ, ఆర్థిక సాధికారత వంటి ఆరు కీలక అంశాలను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ సునీత, అటవీ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు పెంచేలా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం రెబ్బెన మండలం నేర్పల్లి గ్రామపంచాయతీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యావసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ఉపాధ్యాయులు ప్రతిరోజు సమీక్షించాలని, గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, మూత్రశాలల సదుపాయాలను కల్పించడంతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం త్వరగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని, బిల్లులు త్వరగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కలెక్టర్ వెంట రెబ్బెన మండల విద్యాధికారి వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జనకాపూర్ వార్డుకు చెందిన సమీన వేగం తన ఇల్లు ఇటీవల వర్షాలకు కూలిపోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని అర్జీ సమర్పించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరి కాలనీకి చెందిన ఇగురపు తార రెబ్బెన మండలం గంగాపూర్ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ కు చెందిన సమిత్ దాస్ తన కూతురికి ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మైనారిటీ బాలికల గురుకులంలో సీటు ఇప్పించాలని, కాగజ్ నగర్ మండలం నజురుల్ నగర్, దుర్గ నగర్ కు చెందిన సుమతి మండల్ ఇటీవల కురిసిన భారీ వర్షానికి తన చేనులో గల వరి, పత్తి పంటలు మునిగినందున సర్వే జరిపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ కు చెందిన చంద్రకాంత్ మండల్ తనకు జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం లో పేరు తప్పుగా నమోదైందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని ఎస్పీఎం ఓల్డ్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీలో పందుల సంచారం ఎక్కువైందని, నివారించాలని, ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన అక్షర చిట్ ఫండ్ బాధితులు తాము అక్షర చిట్ ఫండ్ లో జమ చేసిన డిపాజిట్ డబ్బులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.



# టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడికి సన్మానం

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్‌లోని ఎంఏ ఆజాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షుడు మిర్జా సలీమ్ బేగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఆ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ అసద్ అలీ మాట్లాడుతూ ఉర్దూ జర్నలిజం అనేది ఉర్దూ భాష సేవ, దాని నిలుపుదల, అభివృద్ధి, ప్రాచుర్యంలో కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. జర్నలిజం ఒక గొప్ప సేవ అని, ఇది ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేర్చడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మాజీ ఉప సర్పంచ్ షేక్ అబూ, మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ జిల్లా అధ్యక్షుడు మౌలానా హారూన్ రషీద్, ఉస్మాన్, మౌలానా అబ్దుర్ రహ్మాన్, ముక్తార్, సయ్యద్ ముజీబ్, వసీం, సమియుల్లా, సైఫ్, ఇతిమాద్ ప్రతినిధి మహ్మద్ షరఫ్‌ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం..

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి ని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని బెల్లంపల్లి జనహిత సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతియేటా జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు, సభ్యుల సహకారంతో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లాగానే తొమ్మిదో వసంతం వినాయక చవితి సంధర్భంగా బెల్లంపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజల కోసం ఈనెల 26న సాయంత్రం 4 గంటలకు బెల్లంపల్లి పట్టణం కాంట అంబేద్కర్ చౌరస్తా, శివాని మెడికల్ వద్ద భక్తులకు 801 మట్టి గణపతి ప్రతిమలు ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# ప్రజా ప్రభుత్వంతో పేదల సొంతింటి కల నిజం



- ఎవరైనా డబ్బులు అడుగుతే నాకు ఫోన్ చేయండి
- ఉట్నూర్ ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తా
- పేదల సొంత ఇంటి కల నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేసుతందని, ఆశించిన ఫలితాలను పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ఇళ్లు మంజూరు అవుతాయని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 980 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని, మంజూరు కానీ లబ్ధిదారులు కరెంట్ అకౌంట్, ఆధార్ నెంబర్ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. పథకం అమలులో ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే నాకు ఫోన్ చేయండి అని లబ్ధిదారులకు నేరుగా సూచించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు కేవలం రవాణా చార్జీలు మాత్రమే భరించాల్సి ఉంటుందని వివరించారు. ఇది నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, తద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గుతుందని అనారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమం విజయవంతానికి కలిసికట్టుగా కృషి చేశారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కేవలం ఇళ్లను నిర్మించడమే కాకుండా.. సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. సొంత ఇల్లు ఉండటం పేద కుటుంబాలకు స్థిరత్వాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ప్రవీణ్, మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బోథ్ మండలంలోని వివిధ ప్రాంతాల రైతులు సోమవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ పాక్స్ డైరెక్టర్ చాట్ల ఉమేష్, బోథ్ ఏఎంసీ డైరెక్టర్ అబ్రార్, బోథ్ ఆత్మ డైరెక్టర్ రహీమొద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్ లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజమణి తనకు ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ ఇప్పించాలని, సిరికొండ మండలం రాయిగూడ గ్రామానికి చెందిన సిడం శ్రీకాంత్ తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఉపాధి కల్పించాలని, బజార్ హత్నూర్ మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన గెడం తేజస్విని ఏదైనా సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అలాగే బజార్ హత్నూర్ మండలం అనంతపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రూపభాయ్ భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. దీంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్ తహసిల్దార్‌కు షోకాజ్ నోటీస్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి కార్యక్రమం అమలులో సక్రమంగా స్పందించలేదని కాగజ్ నగర్ తహసిల్దార్ మధుకర్ కు కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల షోకాజ్ నోటీస్ జారీ చేశారు. భూ భారతి కార్యక్రమం పై జిల్లా కలెక్టర్, జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పదేపదే ఆదేశాలు జారీ చేసినప్పటికీ భూభారతి కార్యక్రమానికి సంబంధించిన ఫైళ్ళు నిర్దేశించిన కాలక్రమంలో సమర్పించడంలో తహసిల్దార్ విఫలమైనట్లు దృష్టికి వచ్చినట్లు , జారీచేసిన షోకాజ్ నోటీస్ మూడు రోజులలో వివరణ ఇవ్వాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్ సిఫారసు చేయనున్నట్లు షోకాజ్ నోటీసులో సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

# గుర్తింపు కార్డు పేరిట రైతులు మోసపోవద్దు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతు వివరాల గుర్తింపు కార్డుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని, జిల్లా రైతులు ఇలాంటి తప్పుడు సమాచారాలు నమ్మి ఎలాంటి గుర్తింపు కార్డులు తీసుకొని మోసపోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రైతు వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల వారు రైతుల వద్ద నగదు తీసుకొని గుర్తింపు కార్డు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం ఎలాంటి మార్గదర్శకాలు ప్రభుత్వం జారీ చేయలేదని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు.

# దుకాణదారులకు నోటీసులు



**ఉద్యమ కెరటం, తాండూర్:** చెత్త ఆరుబయట పడేస్తున్న తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని దుకాణదారులకు సోమవారం రేచిని పంచాయతీ కార్యదర్శి పి శ్రీనివాస్ నోటీసులు అందజేశారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వరరావు రేచిని గ్రామ పంచాయతీని సందర్శించిన సమయంలో దుకాణాల ముందు చెత్తాచెదారం ఉండడాన్ని గమనించరన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు నోటీసులు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

# నవరాత్రి ఉత్సవాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలి




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, తహశీల్దార్ ఎంఏ కలీమ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పోలీసు, రెవిన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో పండగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమీక్షించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కడ కూడా అసాంఘిక కార్యక్రపాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా నిత్యం పారిశుధ్య పనులను కొనసాగించాలని తెలిపారు. విద్యుత్ సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండ సంబందిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అధికారుల సమిష్టి కృషితోనే మండలంలో ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, మండల విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్, ఏపీఓ వసంత్ రావ్, పంచాయతీ కార్యదర్శులు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు

## బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** విద్యాసంస్థల్లో ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. త్వరలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్నతరుణంలో బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ర్యాగింగ్ నియంత్రణపై బెల్లంపల్లి పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల్లోలో ర్యాగింగ్‌కు పాల్పడటం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు. ముఖ్యంగా సీనియర్ల ముసుగులో జూనియర్ విద్యార్థుల పట్ల అసాంఘిక కృత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు విద్యాసంస్థల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. దీంతో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల విద్యా, ఉద్యోగ భవిష్యత్తు అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణ కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇందులో భాగంగా ప్రతి విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. 24గంటల పాటు హెల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల యాజమాన్యం అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలుతామని వివరించారు. విద్యార్థిని ఎవరైనా అవహేళన చేసినా, అవమానంగా మాట్లాడినా ర్యాగింగ్ చేసిన వెంటనే డయల్ 100, హెడ్ కానిస్టేబుల్ స్వప్న సెల్ నం.8712580662, షీ టీమ్ మంచిర్యాల ఎస్సై హైమ సెల్ నం. 8712581092, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సెల్: 8712656559 లపై సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.





## ఘనంగా బీపీ మండల్ జయంతి

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో సోమవారం మండల్ కమిషన్ చైర్మెన్ బీపీ మండల్ 107వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, బౌద్ధ గురూ బంతే భరద్వాజ్ లు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని భారత దేశంలోని బీసీ, ఓబీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ తీసుకొచ్చిన బి పీ మండల్ వారి పితామహులు అయ్యారని కొనియాడారు. 1978 డిసెంబర్ లో అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ పౌర హక్కుల కమిషన్ వేసి 1990 డిసెంబర్ 31 వరకు నివేదిక ఇవ్వాలని, దానికి బిపి మండల్ ని చైర్మెన్ గా నియమించారని పేర్కొన్నారు. వారి నివేదిక ఆధారంగా అన్ని ప్రభుత్వ సంస్థలు, విద్య, ఉద్యోగ అవకాశాల్లో వారి నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని సిపరస్సు చేశారని తెలిపారు. అనంతరం ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి ప్రభుత్వ పరిశీలనలో వచ్చిందని, కానీ అప్పట్లో అమలు చేయ లేదన్నారు. ఆ తర్వాత వి పి సింగ్ ప్రభుత్వం దానిని అమలు చేసి బీసీ లకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం మండల గౌరవ అధ్యక్షులు జయరాం ఉప్రే, బౌద్ధ చార్య సఖ్య మహా కషప్ బోధి(పాండుజి జాడే), సిద్ధార్థ యువజన సంఘం మాజీ అధ్యక్షులు దుర్గం దీపక్, చమల్ ఉప్రె తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై విచారణ జరిపించాలి




**ఉద్యమ కెరటం, వాంకిడి:** ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలపై విచారణ జరిపించాలని భారతీయ జనతా యువ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలాగతి సుచిత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవకతవలపై విచారణ జరిపించే వరకు నిరాహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు. ఈ దీక్షకు బీజేపీ మండల అధ్యక్షులు చీదర్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు పెందుర్ మారుతి, బీజేవైఎం మండల అధ్యక్షులు మందోకర్ విలాస్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి దుర్గం అక్షయ్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు లోనారే గణేష్ తదితరులు మద్దతు తెలిపారు.

## ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మారుతి రెడ్డికు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలలో గంభీరావుపేట పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ యార్డును గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూలగొట్టి మోడ్రన్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పి నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గంభీరావుపేట, లింగన్నపేట హై లెవెల్ బ్రిడ్జి పనులను ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గడ్డమీద ప్రసాద్ రెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు వాజిద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, యాదవ్, ఉపాధ్యక్షులు బి నర్సింలు, బీజేపీ సీనియర్ నాయకులు గంట అశోక్, రాజేందర్ రెడ్డి, లక్ష్మీపురం రాజు గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్, నాయకులు చంద్రం యాదవ్, అంజన్ రావు, దేవేందర్ యాదవ్, అరవింద్ గౌడ్, రాజేష్, రాజు, నరేష్, తిరుపతి, నారాగౌడ్, రాజిరెడ్డి, నవీన్, అనిల్, బంగ్లా శ్రీధర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ రెడ్డికి ఎస్సైగా పదోన్నతి

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలంలో ఏఎస్సైగా గత కొన్ని నెలలుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఎస్సైగా ఎస్పీ మహేష్ బి గీతే చేతుల మీదుగా సోమవారం ఆర్డర్ కాపీని తీసుకున్నారు. గంభీరావుపేట నుంచి ఎస్సైగా పదోన్నతి పొంది సిద్దిపేట జిల్లా కమిషనరేట్ కు బదిలీపై వెళ్లారు. గంభీరావుపేట మండలంలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నిజాయితీ, మానవతా విలువలతో నిండిన అధికారి ఎస్సై పదోన్నతి పొందడం చాలా సంతోషంగా ఉందని మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

# అక్షర వికాసం వయోజనులకు దోహదం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నిరక్షరాస్యులైన వయోజనులకు ఉల్లాస్ కార్యక్రమం వాచకాలు "అక్షర వికాసం, మార్గదర్శిని" పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అక్షర వికాసం, మార్గదర్శిని పుస్తకాలను జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులకు చదువు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమం వాచకాలైన అక్షర వికాసం, మార్గదర్శిని పుస్తకాలు నిరక్షరాస్య వయోజనులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. చదువు మధ్యలో మానేసిన వయోజనులకు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. అర్హత గల ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు జనార్ధన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. కాలుష్యాన్ని నియంత్రిద్దాం

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈనెల 27న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను పూజించి నీటి కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదరిపై ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణం పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రసాయనాలతో కూడిన రంగులు ఉపయోగించి తయారు చేసే విగ్రహాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. నిమజ్జనం తర్వాత ఎక్కువ కాలం నీటిలో కరగకుండా ఉండటంతో నీటి కాలుష్యం జరిగి జలచరాలకు హాని కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడంతో పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రులను సామరస్యంతో జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఈనెల 27న వినాయక చవితి పురస్కరించుకొని గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీసీపీ ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్, పంచాయితీ, పోలీస్, విద్యుత్ ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటు కోసం పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. అనుమతి పొందిన గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో మండపాలను నిర్మించవద్దని, రక్షణతో కూడిన వైరింగ్ వ్యవస్థను వినియోగించాలని సూచించారు. షార్ట్ సర్క్యూట్ లను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లను ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్త వహించాలని, విద్యుత్ సిబ్బందితో వైరింగ్ తనిఖీ చేయించుకోవాలని, ఇందుకోసం టోల్ ఫ్రీ నం.1912పై సంప్రదించాలని పేర్కొన్నారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి మండపం ఎత్తు, వెడల్పు, ఏర్పాటు చేసిన ప్రదేశం వివరాలను సమర్పిస్తే నిమజ్జనం రోజున రూట్ మ్యాప్ రూపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిమజ్జనం రోజున ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చెరువులు, గోదావరి నది, ఇతర నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, మున్సిపల్ పంచాయితీ శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇందారం సమీపంలోని గోదావరి వంతెన వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిమజ్జనానికి అవసరమైన లైట్లు, క్రేన్లు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ గత సంవత్సరం 2,400 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయడం జరిగిందని, ఈసారి మండపాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి గొడవలు, ప్రాణ నష్టం జరగకుండా నిఘా నిర్వహిస్తామని అన్నారు. మండపాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండపాల్లో రాత్రిపూట నిర్వాహకులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, భారీ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టం సర్వే చేయడంలో అధికారులు విఫలం

- **కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** భారీ వర్షాలతో రైతులకు పంట నష్టం జరగగా, నష్టపరిహారం సర్వే చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలం చెందారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. నష్టపోయిన రైతులకు రూ.50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం బాధిత రైతులు, పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొమరంభీం ప్రాజెక్టు ఏడు గేట్ల ద్వారా నీరు వదలడంతో ఆ ప్రవాహానికి పంటలు నాశనమైనట్లు తెలిపారు. సుమారుగా 20 మంది రైతుల 50 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఆ రైతు కుటుంబాలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, లక్షల రూపాయలు అప్పులు చేసి పత్తి పంటను సాగు చేస్తున్న తరుణంలో ప్రాజెక్టు నీటి ప్రవాహం రైతుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆ రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ప్రభుత్వం నుంచి వచ్చేలా చూడాలని కోరారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకూ రైతుల పక్షాన సీపీఎం పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తీక్, గేదం టీకానంద్, అశోక్, వడ్లూరి మల్లేష్, రైతులు, లక్ష్మణ్, మారుతి, రమేష్, గణేష్, తిరుపతి సుభాష్, సంతోష్, గోపాల్, ధర్మాజీ వినోద్, పెంటూ తదితరులు పాల్గొన్నారు.



